# పరివర్తన

రచన : డి. సుధారాణి.

[గత సంచిక తరువాయి]

రత్తి అరుపుకు సీతాలు లేచి కూర్చున్నాడు మంచం మధ్యలో.

రత్తాలు గబగబా పరుగెత్తి కోడిగుడ్డు దీపం పట్టుకు వచ్చి జోగుల్ని పరిశీలనగా చూసింది.

"మావా! యితడు మన జోగులే...నీ వన్యాయం చేసిన జోగులు మఱదలు ఏడ నీవు చేసిన అన్యాయానికి జీవితంపై రోసి దేశాలపై చెప్పా చేయకుండా పోయిన మనజోగులే! ఎప్పుడొచ్చాడో! నీవుచేసిన చెడ్డపనికి నీపై పగ తీర్చుకోవటానికి వచ్చినాడులా వుంది. కాని...నీ సంగతి అతనికేం తెలుసు? నువ్వు తోటకాడ బలవంతం చేస్తే ఆ పాలేరు రంగని చేతిలో చావు దెబ్బలు తిని... తర్వాత ఆ పాడు జీవితంపై రోసిపోయి, నీవు మారిపోయావని నీ మఱదలు చావుకు నీవు పడిన బాధా పొంది నవ్వదా అతనికేం తెలుసు? నువ్వు యింకా మునుపటి అన్నవే అనుకున్నాడు. మరదలి మరణం నిన్ను మార్చేసిందని నీ జీవితం చక్కగా నడుస్తోందని అతని కోసం నీవెంత వెదికింది, అతనికేం తెలుసు మావా! నిండా తాగినట్లుంది. మావా! మంచం పైకి పడదాం." అంటూ నిశ్చేష్టుడైన భర్తను తట్టి లేపింది.

ఇద్దరూ కలసి జోగుల్ని ఎత్తి మంచం మీద పడుకో బెట్టారు. సీతాలు నీళ్ళు తెచ్చి ముఖంపై చల్లాడు. కొద్ది క్షణాలు ఆతృతతో కూడిన చూపులతో తమ్ముణ్ణి పరికించాడు. ఏమూలో తమ్ముని పైనున్న మమకారము...అతని రక్తంలోని సంబంధం అతన్ని వ్యధా పూరితున్ని చేసింది.

"జోగులూ! ఏలావుంది? " అంటూ అడిగింది రత్తాలు.

"జోగులూ! ఎప్పుడొచ్చావు? ఇంటికి రాలేదేం! నీ భార్య ఎడల నేను చేసిన పాపానికి నీ కిష్టంవచ్చిన శిక్ష విధించరా! అందుకు సిద్ధంగా వున్నాను." అంటూ తమ్ముని పాదాలవద్ద చతికిలబడ్డాడు సీతాలు.

జోగులు గబుక్కున లేచి కూచున్నాడు. "అన్నయ్యా! నీలో మార్పువచ్చిందా?" అంటూ ఆశ్చర్యంగా చూశాడు.

"అవును జోగులూ! మీ అన్నయ్య నిజంగా మారిపోయాడు తాను మారటమే కాదు_తన స్నేహితుల్నందర్ని మార్చే ప్రయత్నం చేస్తున్నాడు. అదంతా మా చెల్లె పుణ్యం..." అంటుంటే రత్తం కళ్ళలోనే కాక అచ్చి జ్ఞాపకం వచ్చి జోగులుకి సిగ్గులేకుండా తనుచేసిన తప్పిదానికి సీతాలు కళ్ళలో కన్నీళ్లు చిప్పిల్లాయి.

# కన్నీటి కెరటాలు

రచన : "వాలేకార్"

మసకమసక చీకట్లను అప్పుడప్పుడే పారద్రోలుతూ ముసురుకుంటున్న మసక వెలుగు తెరలను చూచి స్తున్నది.

అది పుష్యమాసం కావడంచేత ఎముకల్ని కొరికే చలి ఆ చలిలో వణుకుతూ కణతల్ని బిగపట్టి పళ్లు పటపట లాడుతున్నా లెక్కచేయకుండా ముగ్గుల్లో మునిగి వుంది కాంత

వెధవ చలికాలం సంక్రాంతిల్లోనే రావాలా? అంటూ ఓ ప్రక్క చలిని తిడుతూనే మరో ప్రక్క పేడకళ్లాపు జల్లి ముచ్చటగా ముగ్గులు వేస్తున్నది కాంత. తెలుగు ఆడపడుచుల ఏకైక పండగ సంక్రాంతి. అందుకే తెల్ల వారఝామున మంచుకురుస్తున్నా, చల్లగా వీచే చలిగాలిని సైతం లెక్కచేయకుండా తలంటు స్నానంచేసి ముగ్గుల ముచ్చటల్లో మునిగివుంది తను.

అప్పటికే ముగ్గులు రోడ్ని సగానికిపైగా ఆక్రమించు కున్నవి. ఇక ముగ్గులు వేసేందుకు అంగుళం మేర కూడా చోటులేక అసంతృప్తిగా లేచి ముగ్గులపై పేడగొబ్బిళ్ళు పెట్టి అందులో గుమ్మడిపూలు గుచ్చి వాటికి పసుపు కుంకాలు పెట్టిన కాంత ఒకసారి తన పనితనాన్ని చూసుకుని తృప్తిపడింది. అంతవరకూ వొంచిన నడుం ఎత్తకుండా కష్టపడి వేసిన ఆ ముగ్గుల అందాన్ని చూస్తున్న కాంతకు కళ్ళలో తృప్తినిండిన ఆనందజేరలు మెరిశాయి, మరొక్కసారి ముగ్గులవైపు చూస్తూనే లోపలికెళ్ళింది "కాంత"

కాంత ఆడపడుచు, రాధ పండుగకు పుట్టింటి కొచ్చి వదిన వేస్తున్న ముగ్గులను చూస్తూ అప్పటికే కాంత అంటే పడేదికాదు. ఆ ముగ్గుల్ని చూస్తూ తనకు ముగ్గులు వేయడం రాదనే వుక్రోషంతో కాంత పనితనాన్ని సహించలేక ఎలాగైననూ ఆ ముగ్గుల్ని చెడగొట్టాలని కాంత లోపలకెళ్ళగానే వెంటనేవచ్చి కాలితో ముగ్గుల్ని గొబ్బిళ్ళ చెరపసాగింది. ఏదో మరచి బయటికొచ్చిన కాంత ఆ దృశ్యాన్ని చూసి అనుకోని ఈ మహత్ సంఘటనకు చలనంలేని స్థాణువులా వుండిపోయింది. ఎంతో కష్టపడ్డ తన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైంది.

చెప్పలేనంత బాధతో కంటతడి పెట్టుకున్న కాంత రాధా ఏమిటీపని?

నీ కడుపుమంట ఇక చల్లారిందా!?

నాపై ఏదైనా కోపముంటే నన్ను సాధించవచ్చు గాని ఈ ముగ్గులపైనా నీ కోపం???

"సాటి ఆడది వేసిన ముగ్గుల్ని చూసి సంతోషపడతారు కాని చెరపడానికి నీకు మనసెలా ఒప్పింది"

వదిన చెప్తున్న మాటలు వినిపించుకోని రాధ మరింత కసితో, తానేదో సాధించానన్న ధీమాతో కయ్యానికి కవ్విస్తూ. కిలకిలమని నవ్వుతూ ఆఖరిగా గొబ్బెమ్మపై కాలుపెట్టిన రాధ పీటజారి అమాంతంగా క్రింద పడి పోయింది.

రాధ పడ్డ చప్పుడు విన్న శాంతమ్మ ఆదరాబాదరా పరుగెత్తుకొచ్చి, "అయ్యో! అయ్యో!! ఎంతపని జరిగిందే తల్లీ" అని కూతుర్ని లేవనెత్తి-

దిష్టిబొమ్మలా చూస్తూ నిలబడకపోతే లేవనెత్త కూడదూ? ఉదయమే నీ పాపిష్టి మొఖమే చూసింది నా కూతురు. అందులో నా తల్లి గట్టిమనిషి కూడకాదు. కన్నతల్లి కడుపుతీపి తొమ్మిది మాసాలు మోసి రక్తం పంచి, కనిపెంచిన వాళ్ళకు తెలుస్తుంది కాని, నీలాంటి గొడ్రాలికేం తెలుస్తుంది!

అందులో ఇది నెల తప్పిన దగ్గరనుండి దీనిమీదే వున్నాయి నీ దిష్టికళ్లు వెళ్లు. ఇంకా ఎదురుగా నిలబడ్డావేం తెల్లంకొట్టిన రాయిలా? అంటూ కోడలును తిట్టిపోస్తూన్న శాంతమ్మ పెద్దపెద్ద అరుపులకు ఈ గొడవలకు అప్పుడే మేలుకొని బయటికొచ్చిన శాంత భర్త రామారావ్ భార్య ముఖంచూసి ఛీ ఛీ రోజూ తెల్లారితే మొదలు వెధవగొడవ అని చీదరించుకుంటూ లోపలికెళ్ళాడు. అతను భార్య ముఖంలో చూసిన ఆ చూపు ఛీఛీ ఉదయమే నీ గొడ్రాలిముఖం చూశాను అనే భావం, కళ్ళలోనే వుండిపోయింది.

మారుమాట్లాడకుండా లోపలకొచ్చి, ఉదయమే అత్తగారి చేత చీవాట్లు తిన్న శాంత తన దురదృష్టానికి తనలో తనే బాధపడడం తప్ప మరేమీ చేయలేకపోయింది.

భళ్ళున తెల్లారింది! అందరి ఇళ్ళలో సంక్రాంతి వేడుకలు శాంత మనస్సులో అగ్ని జ్వాలలు. కళ్ళనుండి కారే వేడి కన్నీళ్లు-ఆ కన్నీళ్లు ఈ ఒక్కరోజువి కావు.

కొన్ని యేళ్ళ తరబడి ప్రతిరోజూ ప్రవహిస్తున్న కన్నీటి కెరటాలు. ఆ కెరటాలవెనుక ఇమిడి పీడించే బాధ ఒకే ఒకటి తను గొడ్రాలినని. తనకోసం తను బాధపడలేదు. ఎదటివారు ఆడిపోసుకునే మాటలకూ, అడపదడపు మాట్లాడే అవకతవక మాటలకూ, అత్తగారు గొడ్రాలివని పదేపదే సాధించే సాధింపుకు భర్త అసహ్యించుకుని చీదరించుకుని విదిలింపులకు శాంతకే కాదు ఆడజన్మ పుట్టిన ఏ సాటి స్త్రీకైనా కన్నీళ్లు రావటం సహజం.

శాంత కన్నీటి పొరలవెనుక ఇమిడివున్న బాధలు గతంలోని సంఘటనలు కళ్ళముందు సినిమా రీలులా గిర్రున తిరగసాగాయి.

ఆ రోజు—

ప్రక్కింటి విమలగారి కూతురు పుట్టిన రోజని పేరంటానికి పిలిస్తే వెళ్ళింది శాంత. ముద్దుగా, బొద్దుగా ముచ్చటగొలిపే ఆ పాపను చూడగానే సహజమైన స్త్రీ హృదయంలోని వాత్సల్యం శాంతలోను పెల్లుబికింది. మాతృత్వానికి నోచుకోని తను మమతను అణుచుకోలేక ఆ పాపను ఎత్తుకొని ముఖంనిండా ముద్దుల వర్షం కురిపించింది.

మరునటి రోజు ఆ పాపకు దురదృష్టవశాత్తు జ్వరం ఆరంభించింది. అప్పుడు ఆ పాప తల్లి విమల పెట్టిన శాపనార్థాలు చెప్పతరం కాదు.

ఎక్కడినుంచి దాపరించిందో పాపిష్టి గొడ్రాలు. దాని దిష్టి తగిలే నా కూతురు మంచం పట్టింది. ఆ దౌర్భాగ్యురాలు కళ్లుపడే ఏనుగులాంటి నా బిడ్డ పీనుగైంది. ఈ పని ఎలా విరగడవుతుందో అని దొరక్క దొరక్క ఈ దరిద్రపు కొంప ప్రక్కనే దొరకాలా ఇల్లు వూర్లోని ఇళ్ళన్నీ గొడ్డుపోయినట్టు అని, ఇంటిని కూడా చేర్చి తిట్టేలోగ ఈ మాటలు విన్న ఇల్లుగలామె ఏమిటి! మా ఇల్లు దరిద్రపు కొంపనా? అని ఇద్దరూ మాట మాట పెంచుకొని ఒకర్నొకరు తిట్టుకొని చివరికి ఆ కయ్యం చిలికి చిలికి గాలి వానైనట్టు ఇద్దరూ జుట్టు జుట్టు పట్టుకొని చీపురు కట్టలు తిరగేసుకున్నారు. చివరికి ఇద్దరూ అలసి దీనివల్లే ఇంతవరకు వచ్చింది అని ఇద్దరూ కలిసి శాంతను తిడుతుంటే ఆడపుట్టుక పుట్టిన ఏ ఆడదీ అనని మాటలు వారు అంటుంటే వింటూ కూర్చున్న దౌర్భాగ్యురాలు శాంతకు కన్నీరు తప్ప పన్నీరెలా వస్తాయి.

ప్రతిరోజూ గుమ్మం దిగగానే శాంతను చూసిన ఎదురింటి నిర్మల బయట ఆడుకుంటున్న తన పిల్లల్ని అమాంతంగా లోపలకు లాక్కొనిపోయేది. ఆమె ప్రవర్తనలో, చూపుల్లో నువ్వు గొడ్రాలివనే భావం స్ఫురించేది. ఆమె ప్రవర్తనకు శాంత మనసు ఎంత కృంగికృశించేపోయేదో ఆ దేవుడికే తెలియాలి.

గడచిన సంవత్సరం ఓ పండగకు వున్న ఒక్కగానొక్క అన్నయని అన్నగారింటికెళ్ళి అన్న పిల్లలతో ఆడుకొంటున్నది.

(సశేషం)